క్లుప్తంగా

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

బంటుమిల్లి: స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో శనివారం నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం విజయవంతానికి పోలీసులు, న్యాయవాదులు సహకరించాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, న్యాయమూర్తి ఈ. సుధాకర్ అన్నారు. పోలీసులు, న్యాయవాదులతో కోర్టు ఆవరణలో శుక్రవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉండి రాజీ చేయదగిన కేసులను లోక్ అదాలత్‌లో పెట్టి రాజీ చేయించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. సమావేశంలో ఎస్‌ఐ ఎ. పైడిబాబు, గణేష్‌కుమార్, న్యాయవాదులు ఎ. రంగనాథ్, వి. కుటుంబశాస్త్రి, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సాయం

మచిలీపట్నంటౌన్: 38వ డివిజన్‌లో ఇటీవల మృతి చెందిన పెదముత్తేవి సత్యనారాయణ కుటుంబ సభ్యులకు డివిజన్‌లోని సామాజిక పింఛనుదారులు ఆర్థిక సాయం అందించారు. డివిజన్‌లోని 180 మంది పింఛనుదారులు ఒక్కొక్కరు రూ. 100 చొప్పున సేకరించగా వచ్చిన రూ. 18 వేల మొత్తాన్ని సత్యనారాయణ కుటుంబ సభ్యులకు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి శ్రీకాకోళపు నరసింహ గుప్తా, కన్వీనర్లు వేముల కృష్ణ, పూజల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా వర్సిటీ రిజిస్ట్రార్‌తో కొమ్మినేని సమావేశం

మచిలీపట్నంటౌన్: కృష్ణా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఎం. రామిరెడ్డితో ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు శుక్రవారం సమావేశమయ్యారు. నూతనంగా ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ జర్నలిస్టుల కోసం ప్రారంభిస్తున్న డిప్లమో ఇన్ జర్నలిజం కోర్సుకు సంబంధించిన విషయాలపై యూనివర్సిటీ రిజిస్ట్రార్‌తో చర్చించారు. త్వరలోనే కృష్ణా యూనివర్సిటీతో ఒప్పందం కుదుర్చుకొని ప్రెస్ అకాడమీ డిప్లమో కోర్సును ప్రకటిస్తుందని చెప్పారు. ప్రెస్ అకాడమీ సెక్రటరీ మామిడిపల్లి బాలగంగాధర్ తిలక్ పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి రూ. 13.64 కోట్లు

మచిలీపట్నంటౌన్: ఉమ్మడి కృష్ణా జిల్లా పరిధిలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో గ్రంథాలయాల అభివృద్ధికి రూ. 13.64 కోట్లతో జిల్లా గ్రంథాలయ సంస్థ రూపొందించిన బడ్జెట్‌ను శుక్రవారం జరిగిన బడ్జెట్ సమావేశంలో పాలకవర్గం ఆమోదించింది. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ తిప్పరమల్లి జమలపూర్ణమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లాలోని గ్రంథాలయాల అభివృద్ధికి గానూ ఈ బడ్జెట్‌ను పాలకవర్గం ఆమోదించింది. 2023–24 సంవత్సరానికి రూ. 13.64 కోట్ల బడ్జెట్‌ను ఆమోదించగా దీనిలో గ్రంథాలయాల భవనాల నిర్మాణం, పుస్తకాల కొనుగోలు, గ్రంథాలయాల నిర్వహణ ఖర్చుల కోసం రూ. 7.50 కోట్లు కేటాయించామని జమల పూర్ణమ్మ తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వి. రవికుమార్ మాట్లాడారు. డీపీఓ నాగేశ్వరనాయక్, వయోజన విద్య డీడీ మొహమ్మద్ హాజీ బేగ్, ఎంఈఓ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

గూడూరు: గూడూరు మండలం మల్లవోలు–2 సచివాలయం పరిధిలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని సర్పంచి బొర్రా సాంబశివయ్య తెలిపారు. గ్రామంలోని మర్రిచెట్టు సెంటర్ నుంచి ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ పాల్గొంటారని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధిపై ముద్రించిన బ్రోచర్లను అందజేసి స్థానికుల సమస్యలను మంత్రి తెలుసుకుంటారని చెప్పారు.

హెచ్‌ఐవీని నియంత్రించాలి

పెదకళ్లేపల్లి(మోపిదేవి): హెచ్‌ఐవీపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ శ్రీరామ్ సాయి అన్నారు. పెదకళ్లేపల్లి గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ సౌజన్యంతో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ శ్రీరామ్ సాయి మాట్లాడారు. ఎయిడ్స్ వ్యాధి లక్షణాలు, వ్యాప్తి, నియంత్రణ చర్యలను వివరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మచిలీపట్నంటౌన్: నగరంలోని విద్యుత్ ఉపకేంద్రాల పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఈఈ ఎం. భాస్కరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈడేపల్లి శ్రీనివాస నగర్ కాలనీ, పంచాయతీ రాజ్ కాలనీ, నారాయణపురం, పంబలగూడెం, టెంపుల్ కాలనీ, డ్రైవర్స్ కాలనీ, పాత, కొత్త హౌసింగ్‌బోర్డు కాలనీలు, మాచవరం, ఆనందపేట, వలందపాలెం, గొడుగుపేట, రాజుపేట, ఖొజ్జిల్లిపేట, మూడు స్తంభాల సెంటర్, కుమ్మరిగూడెం ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని చెప్పారు.

ఖేలో ఇండియా విజేతలకు ప్రశంసలు

- స్కాలర్స్ విద్యాసంస్థ ఆధ్వర్యంలో క్రీడాకారులకు ఘన స్వాగతం
- పతకాలు సాధించిన క్రీడాకారులకు రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో సన్మానం
- జాతీయ గుర్తింపు తెచ్చిన గాయత్రికి ప్రశంసలు
- పాల్గొన్న కృష్ణా జిల్లా క్రీడా శాఖ అధికారి ఝాన్సీలక్ష్మీ



స్కాలర్స్ హైస్కూల్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి వాటర్ స్పోర్ట్స్ విజేతలతో ర్యాలీ

నాగాయలంక: మధ్యప్రదేశ్‌లో ఇటీవల జరిగిన ఐదవ ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో ప్రతిభ చూపిన క్రీడాకారులకు ప్రశంసల జల్లు కురిసింది. ఉమెన్ సింగిల్ కెనోయ్ స్లాలమ్‌లో ఏపీ తరపున రజత పతకం సాధించిన స్థానిక యువతి నాగిడి గాయత్రి, నాలుగో స్థానం పొందిన నాగిడి భార్గవి, విజయవాడకు చెందిన బ్రాంజ్ మెడల్ విజేత వేముల అచ్యుత్‌కుమార్, కొల్లకాని విష్ణు (ఏడో స్థానం) శుక్రవారం నాగాయలంక వచ్చిన సందర్భంగా ఘనస్వాగతం లభించింది. గాయత్రి విద్యాభ్యసించిన నాగాయలంకలోని స్కాలర్స్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ అధినేత సునీల్ కుమార్ పట్నాయక్ నేతృత్వంలో ఆ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనస్వాగతం పలికారు. గాయత్రి, ఇతర క్రీడాకారులు, వాటర్ స్పోర్ట్స్ కోచ్‌లను ప్రత్యేక వాహనంపై జాతీయ జెండాలు చేతపట్టి, పూలు చల్లుతూ గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ప్రధాన కూడలిలో నిర్వహించిన కార్యక్రమంలో తహసీల్దార్ జె.విమలకుమారి చేతుల మీదుగా పాఠశాల తరఫున క్రీడాకారులను సత్కరించారు. విజేతలను స్ఫూర్తిగా తీసుకోవాలని తహసీల్దార్ పిలుపునిచ్చారు.

ఇండియన్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో..

కృష్ణానది తీరంలోని వాటర్ స్పోర్ట్స్ అకాడమీ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో రెండు సార్లు జాతీయస్థాయి రజత పతకాలు సాధించిన నాగిడి గాయత్రి (నాగాయలంక) ఇతర క్రీడాకారులు నాగిడి భార్గవి, అచ్యుత్ కుమార్, విష్ణు, కోచ్‌లను సత్కరించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ స్థానిక సబ్ బ్రాంచ్ చైర్మన్ భోగాది శివవిష్ణువర్ధన్ ఆధ్వర్యంలో క్రీడా శాఖ జిల్లా అధికారి ఝాన్సీలక్ష్మి, ఏఎంసీ మాజీ చైర్మన్ మండవ బాలవర్ధిరావు చేతుల మీదుగా వారిని ఘనంగా సన్మానించారు. ఝాన్సీలక్ష్మి మాట్లాడుతూ రూ.3 కోట్లతో నాగాయలంక వాటర్ స్పోర్ట్స్ అకాడమీ భవనం నిర్మాణ దశలో ఉందని, పడవల అవసరం, మౌలిక సదుపాయాలపై ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. గాయత్రికి రూ.4 వేలు, భార్గవికి రూ.3 వేల చొప్పున బాలవర్ధిరావు నగదు బహుమతులు అందించారు. కోచ్‌లు టి.నాగబాబు, ఎం.శ్రీనివాస్, గాయత్రి తల్లిదండ్రులు నాగిడి నాగబాబు, వెంకట నాగేశ్వరమ్మ, తలశిల రఘుశేఖర్ రెడ్‌క్రాస్ జీవితకాల సభ్యులు బీసాబత్తిన ప్రసాద్, మునగాల కుటుంబరావు, జల్లూరి మురళి, మత్స్యకార కుటుంబాలు తదితరులు పాల్గొన్నారు.

హాజీ హుస్సేన్ సేవలు చిరస్మరణీయం

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- జెడ్పీ హైస్కూల్‌లో స్మారక స్థూపం ఏర్పాటు



హుస్సేన్ తల్లిదండ్రులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు తదితరులు

అవనిగడ్డ: దేశం కోసం ప్రాణాలర్పించిన షేక్ హాజీ హుస్సేన్ సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. అవనిగడ్డకు చెందిన షేక్ హాజీ హుస్సేన్ 2019, డిసెంబర్ 5వ తేదీన ఉత్తరాఖండ్‌లో విధులు నిర్వహిస్తూ మైనస్ 30 డిగ్రీల మంచులో ఊపిరి ఆడక మృతిచెందాడు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో హుస్సేన్ 2006లో పదో తరగతి వరకూ చదివారు. ఇండియన్ టిబెటన్ బోర్డర్ ఫోర్స్ ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ హైస్కూల్ ఆవరణలో స్మారక స్థూపం నిర్మించారు. ఈ స్థూపాన్ని ఎమ్మెల్యే సింహాద్రి, ఇండియన్ టిబెటన్ బోర్డర్ ఫోర్స్ వైజాక్ కేడర్ ఐపీఎస్ అధికారి శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. ఎమ్మెల్యే సింహాద్రి మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలర్పించిన హుస్సేన్‌ని విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ప్రతిరోజూ ఒక విద్యార్థి ఈ స్థూపం వద్ద పూలు ఉంచి నివాళులర్పించాలన్నారు. ఐపీఎస్ అధికారి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఇండియన్ టిబెటన్ బోర్డర్ ఫోర్స్ ఆధ్వర్యంలో తొలిసారిగా ఇక్కడ స్మారక స్థూపం నిర్మించామని చెప్పారు. జయంతి, వర్ధంతి కార్యక్రమాల్లో తాము పాల్గొంటామని తెలిపారు. ఈ సందర్భంగా హుస్సేన్ తల్లిదండ్రులు షేక్ మహబూబ్, షేక్ షకీలా బేగంను ఘనంగా సత్కరించారు. జెడ్పీ సీఈఓ జి. శ్రీనివాసరావు, డీఆర్‌ఓ ఎం. వెంకటేశ్వర్లు, ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, మండల కో–ఆప్షన్ సభ్యులు షేక్ నజీర్‌బాషా, ఎంపీటీసీ స్వర్ణకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీచర్స్ కో–ఆపరేటివ్ సొసైటీ ఎన్నికలు ఏకగ్రీవం



నియామక పత్రం అందుకుంటున్న పెరుమాళ్లు. చిత్రంలో ఎమ్మెల్సీ కల్పలత

అవనిగడ్డ: అవనిగడ్డ మండల పరిషత్ టీచర్స్ ఎంప్లాయిస్ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. సొసైటీ అధ్యక్షుడిగా రెండోసారి జీవీఎస్ పెరుమాళ్ళుని ఎన్నుకున్నారు. సంఘం పాలకవర్గంలోని ఏడు స్థానాలకు ఏడు నామినేషన్లు దాఖలు అయ్యాయి. దీంతో అధ్యక్షుడిగా పెరుమాళ్లతో పాటు లంకే వెంకటేశ్వరరావు, నరహరశెట్టి అనిత, సూరగం వెంకట సుబ్బయ్య, వెంకట రత్నారావు, మన్నే ప్రేమ్‌చంద్, ఉద్దంటి వీరవెంకట ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి కె. లీల తెలిపారు. నూతన కార్యవర్గాన్ని ఎమ్మెల్సీ టి. కల్పలత, పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు డి. శ్రీను, ప్రధాన కార్యదర్శి పి. వెంకటేశ్వరరావు, నాయకులు అభినందించారు.

జగన్ పాలనలో పాఠశాలలకు మహర్దశ

పేర్ని కిట్టు



అదనపు తరగతి గదులకు శంకుస్థాపన చేస్తున్న పేర్ని కిట్టు. చిత్రంలో మేయర్ వెంకటేశ్వరమ్మ

మచిలీపట్నంటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందుతున్నాయని వైఎస్సార్ సీపీ నాయకుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. నగరంలోని చిలకలపూడి పాండురంగ మునిసిపల్ ఉన్నత పాఠశాలలో నాడు – నేడు పథకం ద్వారా రూ. 72 లక్షలతో నిర్మించనున్న ఆరు అదనపు తరగతి గదుల నిర్మాణానికి, గ్రీన్‌కో సంస్థ రూ. 1.75 కోట్లతో పది అదనపు తరగతి గదులు, గ్రీనరీ, ప్లేగ్రౌండ్ నిర్మాణానికి నగర మేయర్ మోకా వెంకటేశ్వరమ్మతో కలిసి పేర్ని కిట్టు భూమి పూజ, శంకుస్థాపన చేశారు. పేర్ని కిట్టు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలను నాడు – నేడు పథకం ద్వారా కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా అభివృద్ధి చేసి పేద విద్యార్థులకు మంచి విద్యను అందిస్తున్నారని చెప్పారు. మొదటి విడత నాడు–నేడు పథకం ద్వారా నియోజకవర్గంలోని పలు పాఠశాలలను అభివృద్ధి చేశారని, ప్రస్తుతం రెండో విడత నాడు – నేడు పథకం ద్వారా అదనపు తరగతి గదులు, టాయిలెట్లు, మౌలిక సదుపాయాలు తదితర పనులు చేస్తున్నారని వివరించారు. గ్రీన్‌కో సంస్థ చిలకలపూడి పాండురంగ మునిసిపల్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి నిధులు కేటాయించి పాఠశాలను సుందరంగా తీర్చిదిద్దేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంయూడీఏ చైర్‌పర్సన్ బొర్రా దుర్గాభవాని, డెప్యూటీ మేయర్ తంటిపూడి కవిత థామస్ నోబుల్, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్ దాదా, కార్పొరేటర్లు పర్ణం సతీష్, శ్రీరాం చిన్నా, మాజీ కౌన్సిలర్ చిటికిన నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు గాజుల భగవాన్, రాసంశెట్టి చంటి, కొల్లు రమేష్, వనబాబు, బందరుకోట హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని కనకదుర్గ, టీవీ రఘుకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మెరక పనులకు సహకరించాలి



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ బీవీ ప్రసాద్

గూడూరు: వైఎస్సార్ జగనన్న కాలనీల్లో చేపట్టిన మెరక పనులకు రైతులు సహకరించాలని గూడూరు తహసీల్దార్ బి.విజయప్రసాద్ అన్నారు. కప్పలదొడ్డి, రాయవరం, కంచాకోడూరు గ్రామాల్లోని లే అవుట్లలో జరుగుతున్న మెరక పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. కప్పలదొడ్డిలో రైతులు తమ ప్రాంతంలోని ఇసుక దిబ్బల నుంచి మట్టి తరలించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ ప్రభుత్వ లే అవుట్ మెరక పనులకు మట్టి తరలించడంపై అభ్యంతరం వ్యక్తం చేయడం సమంజసం కాదన్నారు. మీ గ్రామంలోని లబ్ధిదారుల కోసమే లే అవుట్‌ను మెరక చేస్తున్నామని, ఇలాంటి సమయంలో రైతులు కూడా ప్రభుత్వానికి సహకరించాలని ఆయన కోరారు. రైతులు సానుకూలంగా స్పందించారు. పంచాయతీ రాజ్ ఏఈ లోయ హరిబాబు, వీఆర్వో వరప్రసాద్, కార్యదర్శి పాండురంగారావు, వైఎస్సార్ సీపీ నాయకులు పేరిశెట్టి మధు, రైతులు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదుపై డీఎల్‌డీఓ విచారణ

చల్లపల్లి: చల్లపల్లి మండల పరిషత్ కాంప్లెక్స్ దుకాణాలకు అద్దె వేలం నిర్వహణపై హైకోర్టు ఆదేశాలు అమలు చేయాలని స్పందనలో వచ్చిన ఫిర్యాదు మేరకు డీఎల్‌డీఓ జి.పద్మావతి శుక్రవారం విచారణ చేశారు. గ్రామంలోని రాజీవ్ గాంధీ మండల పరిషత్ షాపింగ్ కాంప్లెక్స్ దుకాణాలకు అద్దెలు సక్రమంగా చెల్లించట్లేదని, అద్దెలు తక్కువగా ఉన్నాయని ఇటీవల ఫిర్యాదులు వచ్చాయి. దుకాణాల కాల పరిమితి ముగిసిందని, వీటికి బహిరంగ వేలం నిర్వహించాలని కొందరు కోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో హైకోర్టు ఈ దుకాణాలకు వేలం నిర్వహించాలని ఆదేశించింది. ఈ క్రమంలో వేలం నిర్వహించడం లేదని మరోసారి స్పందనకు ఫిర్యాదు రావడంతో జాయింట్ కలెక్టర్ ఆదేశాలతో డీఎల్‌డీఓ మండల పరిషత్ కార్యాలయంలో కాంప్లెక్స్ వ్యవహారానికి సంబంధించిన రికార్డులు, ఉత్తర ప్రత్యుత్తరాలు పరిశీలించారు. నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పిస్తామని పద్మావతి తెలిపారు. ఎంపీపీ కోట విజయ రాధిక, డీఎల్‌డీఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ హేమప్రకాష్, సీహెచ్ దేవీకిరణ్, ఈఓపీఆర్డీ బూరేపల్లి అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

ఈ క్రాప్, ఈకేవైసీ తప్పనిసరి

పెడన: రైతులు తప్పనిసరిగా ఈ క్రాప్, ఈకేవైసీ చేయించుకోవాలని, అప్పుడే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని పెడన మండల వ్యవసాయ సలహా సంఘ అధ్యక్షుడు కాగిత వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక పెడన ఏఎంసీలో జరిగిన సంఘ సమావేశంలో చైర్మన్ మాట్లాడారు. రైతులు లబ్ధిపొందడానికి, అర్హులుగా గుర్తించడానికి ఈక్రాప్, ఈకేవైసీ చేయించాలన్నారు. ఈ విధంగా నమోదు చేయడం వల్ల భవిష్యత్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలకు అర్హులుగా గుర్తించి లబ్ధి చేకూరుతుందని చెప్పారు. ఈ క్రాప్, ఈకేవైసీ చేయించుకోకపోతే పథకాలు వర్తించవని స్పష్టం చేశారు. వలంటీర్లు, వీఏఏలు రైతులకు పూర్తిగా అవగాహన కల్పించేలా చర్యలు తీసుకుని వారితో ఈ క్రాప్, ఈకేవైసీ ప్రతి పంటకు నమోదు చేయించేలా చూడాలన్నారు. ధాన్యం వలే కాకుండా మినుము ధర అధికంగా లభించే చోట విక్రయించుకునే అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందని, రైతులు ఈ క్రాప్, ఈకేవైసీ చేయించుకుంటే తప్పనిసరిగా కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలనేది లేదని ఆయన వివరించారు. సమావేశంలో మాజీ ఎంపీపీ రాజులపాటి అచ్యుతరావు, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు దావు భైరవలింగం, ఏఓ జీవీ శ్రీనివాసరావు, డెప్యూటీ తహసీల్దార్ కాగిత పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

పురుగు మందుల అధిక వినియోగం అనర్థం

కోనేరుసెంటర్: పంటలకు పురుగు మందులను అధికంగా వాడడం అనర్థదాయకమని జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు జన్ను రాఘవరావు అన్నారు. బందరు మండలం చిన్నాపురం గ్రామంలో మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం శుక్రవారం జరిగింది. మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు గణపతుల చూడామణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జన్ను రాఘవరావు మాట్లాడారు. రైతులు తన పొలంలో పురుగులు ఉన్నా.. లేకున్నా పక్క పొలంలో ఉన్న రైతుల పొలాలను బట్టి అధిక మోతాదులో ఎరువులను ఉపయోగిస్తున్నారని చెప్పారు. ఈ విధానం వలన ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. అవసరమైన మోతాదులో ఎరువులను వాడి పంట దిగుబడి పొందాలని సూచించారు. ఎరువుల వాడకంలో రైతులు వ్యవసాయ శాఖాధికారుల సూచనలు, సలహాలు పాటించాలన్నారు. ఏఓ జీవీ శివప్రసాద్, సర్పంచ్ కె. గోపాలరావు, వైఎస్సార్ సీపీ గ్రామ ఇన్‌చార్జి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

మిత్ర, శత్రు పురుగులను గుర్తించాలి

కె. కొత్తపాలెం(మోపిదేవి): మినుము సాగులో మిత్ర, శత్రు పురుగులను గుర్తించి తగిన మోతాదులో మందులు పిచికారీ చేయాలని ఏడీఏ జయప్రద రైతులకు సూచించారు. కె. కొత్తపాలెంలో పొలంబడి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 30 మంది రైతులను గ్రూపుగా ఏర్పాటు చేసి వారిచే పంట పొలాన్ని పరిశీలింపజేశారు. ఆమె మాట్లాడుతూ పంటలో వ్యాపిస్తున్న దోమ, పురుగును రైతులే స్వయంగా గమనించి గ్రూపులో చర్చించుకునేలా అవగాహన కల్పించారు. రైతులకు అవగాహన లేక రెండు, మూడు రకాల మందులు పిచికారీ చేస్తున్నారని, దీని వల్ల పంట దిగుబడులు రాకపోగా, నష్టం వాటిల్లే అవకాశం ఉందని చెప్పారు. అనంతరం సమీపంలోని రైతుల మినుము పంటపై అక్కడక్కడా కనిపిస్తున్న బంగారు తీగను గుర్తించారు. రైతులు స్టాంప్ మందు తగిన మోతాదులో పంటపై వ్యవసాయ అధికారుల సూచన మేరకు పిచికారీ చేయాలని చెప్పారు.

జగనన్న లే అవుట్స్‌లో విద్యుత్ వెలుగులు



వీధి లైట్లు వేసిన విద్యుత్ శాఖాధికారులు

రావివారిపాలెం(మోపిదేవి): రావివారిపాలెం జగనన్న లే అవుట్స్‌లో విద్యుత్ శాఖాధికారులు శుక్రవారం ద్యుత్ కనెక్షన్ ఇచ్చి వెలుగులు నింపారు. ఈ సందర్భంగా చల్లపల్లి సబ్ డివిజన్ విద్యుత్ శాఖ డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పులి శివనాగేశ్వరరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు కృషితో రావివారిపాలెంలో నూతనంగా వేసిన 4, 5 లే అవుట్స్‌లో విద్యుత్ లైన్లు పూర్తి చేసి వీధి లైట్లు కూడా ఏర్పాటు చేశామని చెప్పారు. విద్యుత్ లైన్ టెస్ట్ చార్జ్ చేసి కరెంట్ లైన్‌కు ఇచ్చామన్నారు. రెండు లే అవుట్‌లలో 344 ప్లాట్స్‌కు గాను సుమారు రూ. 30 లక్షల వ్యయంతో 100 విద్యుత్ స్తంభాలు, రెండు 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు, ఒక 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశామని వివరించారు. మండల విద్యుత్ శాఖ ఏఈ పాండురంగారావు, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయండి

- బందరు ఆర్డీఓ కిషోర్
- విశ్వనాథపల్లి, కోడూరు లే అవుట్ల పరిశీలన



పెట్రోల్ బంక్ స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ కిషోర్

కోడూరు: జగనన్న లే అవుట్లలో ప్లాట్లు మంజూరైన లబ్ధిదారులు గృహ నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని బందరు ఆర్డీఓ కిషోర్ అన్నారు. శుక్రవారం విశ్వనాథపల్లి, కోడూరు లే అవుట్లను స్థానిక రెవెన్యూ, హౌసింగ్, పంచాయతీ రాజ్ శాఖాధికారులతో కలిసి ఆర్డీఓ పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన బిల్లులు కూడా లబ్ధిదారుల ఖాతాల్లో త్వరితగతిన జమ చేస్తున్నారని, అందుకు తగ్గటుగా నిర్మాణ పనులను పూర్తి చేసుకోవాలని ఆర్డీఓ సూచించారు. లే అవుట్లలో రహదారుల నిర్మాణానికి మెరక పనులు కూడా స్థానిక అధికారులు వేగవంతం చేయాలని ఆదేశించారు. వి.కొత్తపాలెం, కోడూరు, ఉల్లిపాలెం లేఅవుట్లలో మాత్రమే ఇళ్ల నిర్మాణాలు వేగం జరుగుతున్నాయని, మిలిగిన ప్రాంతాల్లో కూడా లబ్ధిదారులకు అవగాహన కల్పించి నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. రైతులకు అవగాహన కల్పించి నీటి తీరువా వసూళ్లను కూడా డిజిటల్ విధానంలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ సూచించారు.

పెట్రోల్ బంక్ నిర్మాణానికి స్థల పరిశీలన..

మండలంలో నూతన పెట్రోల్ బంక్ నిర్మాణానికి సంబంధించిన స్థలాన్ని స్థానిక అధికారులతో కలిసి ఆర్డీఓ పరిశీలించారు. వి.కొత్తపాలెం–విశ్వనాథపల్లి గ్రామాల మధ్య బంక్ నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదించిందని చెప్పారు. బంక్ నిర్మాణం జరిగే స్థలానికి ఇరువైపులా ఉన్న స్థానికులతో మాట్లాడారు. తహసీల్దార్ షేక్ లతీఫ్‌పాషా, పంచాయతీ రాజ్ ఏఈ విజయకుమార్, ఏఓ భానుప్రకాష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగు లాభసాటి

జిల్లా ఉద్యాన అధికారి జ్యోతి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఉద్యాన అధికారి జ్యోతి

మచిలీపట్నంటౌన్: ఉద్యాన పంటల సాగు రైతులకు లాభసాటి అని జిల్లా ఉద్యాన అధికారి జె.జ్యోతి అన్నారు. ఉద్యాన పంటలు, సూక్ష్మ బిందు సేద్యంపై అవగాహన సదస్సు శుక్రవారం మచిలీపట్నంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ పలు రకాల కూరగాయలు, పండ్ల సాగు ద్వారా రైతులు లాభాలను పొందవచ్చన్నారు. మేలు రకాలైన వంగడాలను వినియోగించడం ద్వారా అధిక దిగుబడులు పొందవచ్చునన్నారు. ఉద్యాన శాఖ సిబ్బంది ఈ–పంట, ఈ–కేవైసీ చేసేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రబీ పంట నమోదు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. వైఎస్సార్ తోట బడి కార్యక్రమాల ద్వారా రైతుల నుంచి వచ్చిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. పథకాలను రైతులకు వివరించి వర్తింపజేయాలన్నారు. జిల్లా మైక్రో ఇరిగేషన్ ఆఫీసర్ జి.విజయలక్ష్మి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ బిందు సేద్యం పథకం, ప్రధాన మంత్రి సూక్ష్మ ఆహారశుద్ధి, క్రమబద్ధీకరణ పథకాలను వినియోగించుకోవాలన్నారు. వ్యక్తిగత ఆహారశుద్ధి పరిశ్రమలు, గ్రూపు పరిశ్రమలు, ఉమ్మడి మౌలిక సదుపాయాలు, మార్కెటింగ్, గ్రౌండింగ్ చేసేందుకు ప్రాజెక్టు వ్యయం మీద 30 నుంచి 50 శాతం రాయితీ లభిస్తుందని తెలిపారు. సూక్ష్మ బిందు సేద్యం, స్ప్రింక్లర్ ఇరిగేషన్ వల్ల రైతులకు మేలు జరుగుతుందన్నారు. సమావేశంలో మచిలీపట్నం ఉద్యాన అధికారి చందు, గ్రామ ఉద్యాన సహాయకులు పాల్గొన్నారు.

ఆ పథకాలపై గుజరాత్ అధికారుల ఆరా

- పెడన పీహెచ్‌సీ సందర్శన
- 'ఆయుష్మాన్ భారత్' పథకం నిర్వహణ పరిశీలన
- టెలి మెడిసిన్ అమలు తీరుకు ప్రశంసలు



పెడన పీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న గుజరాత్ అధికారులు

పెడన: పెడన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గుజరాత్‌కు చెందిన అధికారులు శుక్రవారం పరిశీలించారు. గుజరాత్ రాష్ట్రానికి చెందిన వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్ అజయ్ పరాక్, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ బ్యంగరాజ్ త్రివేదిలు పెడన పీహెచ్‌సీలో అమలవుతున్న ఆయుష్మాన్ భారత్, టెలి మెడిసిన్ పథకాల అమలు తీరును పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రవేశపెట్టిన ఈ రెండు పథకాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అమలయ్యే విధానాన్ని పరిశీలించేందుకు వచ్చినట్లు వారు పీహెచ్‌సీ వైద్య సిబ్బందికి తెలిపారు. గుజరాత్‌లో ఈ పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి ఆంధ్రాలో ఈ పథకం అమలు తీరుతెన్నులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని చెప్పారు. ఆయా పథకాలు అమలవుతున్న తీరును ఆస్పత్రిలోని వైద్యాధికారి డాక్టర్ మీనాదేవి గుజరాత్ అధికారులకు వివరించారు. ఎంపీహెచ్‌ఓ ఎం.వీరయ్య, హెచ్‌ఎస్ శ్రీనివాస్, యూడీసీ ఖాన్, హెచ్‌సీ లీలాకృష్ణ, హెచ్‌వీ మణి, సీహెచ్‌ఓ రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

'మానవత–నైతికత' కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

మచిలీపట్నంటౌన్: ఆంధ్రప్రదేశ్ జమాతే ఇస్లామీ హింద్ మచిలీపట్నం నగర శాఖ, మినార్ మసీదు కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం నుంచి ఈనెల 20వ తేదీ వరకు మానవత–నైతికత అంశంపై జరిగే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సంఘ ప్రతినిధులు కోరారు. స్థానిక కోనేరు సెంటర్‌లోని మినార్ మసీదు వద్ద కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జమాతే ఇస్లామీ హింద్ జిల్లా అధ్యక్షుడు జనోస్ యూనస్ ఉమ్రా మాట్లాడుతూ తోటి వారి పట్ల జాలి, దయ, సానుభూతి చూపించడం, కుల మతాలకు అతీతంగా మనుషులందర్నీ ప్రేమించడం, జీవరాశుల పట్ల దయ చూపించడం వంటి చర్యలకు ప్రతి ఒక్కరు పూనుకోవాలన్నారు. నైతికత అంటే మనుషుల్లో ఉండే సహజ గుణాల సమాహారమని చెప్పారు. మానవత–నైతికత కార్యక్రమాన్ని 10 రోజుల పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా గ్రూపు మీటింగ్‌లు నిర్వహించి ప్రజలను చైతన్యవంతం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో కన్యకా పరమేశ్వరి ఆలయ అర్చకుడు నారాయణశర్మ, పాస్టర్ జాషువా, జమాతే ఇస్లామీ హింద్ మచిలీపట్నం నగర అధ్యక్షుడు మొహమ్మద్ ఫెరోజ్, కాంగ్రెస్ నాయకుడు అబ్దుల్ మతీన్, టీడీపీ నాయకుడు అబ్దుల్ అజీమ్, వైఎస్సార్ సీపీ నాయకులు బాషు, అన్వర్ హుస్సేన్, ముస్లిం ఐక్య వేదిక అధ్యక్షుడు షేక్ మౌలాలి, బీసీ సంక్షేమ సంఘం నాయకుడు సత్యనారాయణ పాల్గొన్నారు.